క్లుప్తంగా

ఆక్రమణల గుర్తింపు



అక్రమంగా ఏర్పాటు చేసిన బడ్డీని పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు

కాశీబుగ్గ: ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీని ఆనుకొని ఉన్న అనధికార ఆక్రమణలను గుర్తించామని పలాస–కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు అన్నారు. శుక్రవారం జంట పట్టణాలలో పర్యటించి రోడ్డు పక్కన స్థలం ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారిని గుర్తించి చర్యలు చేపడతామని అన్నారు. అనంతరం కాశీబుగ్గ బస్టాండ్‌లో రోజువారీ వ్యాపారాలకు వీలుగా, ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ఉండేలా సిబ్బందితో కలిసి ప్రణాళికలను రూపొందించారు.

పూర్వ విద్యార్థి ఔదార్యం



సామగ్రిని అందజేస్తున్న శ్రీనివాసరావు

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం వీరరాఘవపురం ప్రాథమిక పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థి, శ్రీకాకుళం ఐడీబీఐ బ్యాంక్ మేనేజర్ ముద్దాడ శ్రీనివాసరావు సీఎస్ఆర్ ఫౌండ్ ద్వారా పాఠశాలకు బీరువ, కంప్యూటర్, ప్రింటర్, ఫర్నిచర్ సమకూర్చారు. వీటిని ఎంఈవో ఎల్.వి.ప్రతాప్, పల్లి కోటేశ్వరరావుల చేతులు మీదుగా ప్రధానోపాధ్యాయులు తేజేశ్వరరావుకి శుక్రవారం అందజేశారు. ఉపాధ్యాయులు అంపోజు వల్లి, బ్యాంకు సిబ్బంది గణపతి, తారక్, సాయి పాల్గొన్నారు.

ఘనంగా సంతోషిమాత ఆలయ ప్రతిష్ట



సంతోషిమాత విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం గ్రామంలో సంతోషిమాత ఆలయ, విగ్రహ ప్రతిష్ఠాపన శుక్రవారం వైభవంగా జరిగింది. పండితులు నీలగగిరి రామకృష్ణ సిద్ధాంతి నేతృత్వంలో వేద పండితులు అగ్నిస్థాపన, పూర్ణకలశ స్థాపన, అమ్మవారి విగ్రహ ప్రాణప్రతిష్ఠా కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం పూర్ణాహుతి జరిగింది. జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, సర్పంచ్ నర్తు వరప్రసాద్, వీఆర్వో ఉప్పాడ రాజారెడ్డి, అధికసంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

● డీఎస్పీ వెంకట అప్పారావు



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట అప్పారావు

ఇచ్ఛాపురం రూరల్: సైబర్ మోసాలపై అవగాహన అవసరమని కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు అన్నారు. అరకబద్రలో శుక్రవారం నిర్వహించిన 'సంకల్పం' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. మహిళలు, బాలికలు ఆన్‌లైన్ స్నేహాల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని, అపరిచితుల ఫోన్ కాల్స్, మెసెజ్‌లకు స్పందించవద్దన్నారు. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సీఐ ఎం.చిన్నంనాయుడు, ఎస్ఐ ఇ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అనాథలకు అన్నదానం



అన్నం వడ్డిస్తున్న ఆర్డీవో వెంకటేష్

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి కోసంగిపురం జాతీయ రహదారి కూడలి వద్ద ఉన్న లలితాశ్రమంలోని అనాథులకు పలాస ఆర్డీవో జి.వెంకటేష్ తన కుటుంబ సభ్యులతో అన్నదానం చేశారు. ఆశ్రమ నిర్వహకులు ఆర్డీవోకు కృతజ్ఞతలు తెలియజేశారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న దివ్యాంగురాలి పేరు మెండ శారద. ఈమెది కోటబొమ్మాళి మండలం తాటిపర్తి గ్రామం. పుట్టినప్పటి నుంచి పూర్తిగా అంగవైకల్యం కావడంతో నడవలేని పరిస్థితి. కొన్ని సంవత్సరాలుగా ఈమెకు దివ్యాంగ పింఛన్ అందుతోంది. పింఛన్ పరిశీలన చేసుకోవాలని ఇటీవల అధికారులు నోటీసులు ఇచ్చారు. దీంతో తన సోదరుడి సాయంతో టెక్కలి జిల్లా ఆస్పత్రికి వచ్చి ఇలా ఆయా విభాగం వద్ద తన అంగవైకల్యం, ధ్రువపత్రాల పరిశీలన కోసం ఎదురుచూస్తోంది.



కోటబొమ్మాళి మండలం గట్లపాడు గ్రామానికి చెందిన మదేను ఉగాది అనే దివ్యాంగుడికి చిన్నతనం నుంచి పూర్తిగా కాళ్లు, చేతులు పనిచేయవు. కనీసం నడవలేని దుస్థితి. పింఛన్ పునఃపరిశీలన చేసుకోవాలని అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో తప్పనిసరి పరిస్థితిలో తన సోదరుడు సాయంతో టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చాడు. పూర్తిగా నడవలేని స్థితిలో ఉన్న తనకు ఇలా ఇబ్బందులు చేయడం సరికాదంటూ ఈయన వాపోయాడు.

ఇదేమి పరీక్ష?

● పింఛన్ పునఃపరిశీలన పేరుతో తిప్పలు
● సుదూర ప్రాంతాల నుంచి వస్తూ దివ్యాంగులు ఇబ్బందులు



టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మేడపైన దివ్యాంగుల పింఛన్లను పునఃపరిశీలన చేస్తున్న వైద్య సిబ్బంది

టెక్కలి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొన్ని రకాల పింఛన్‌దారులను అవస్థలకు గురి చేస్తున్నారు. దివ్యాంగ పింఛన్లు అందుకుంటున్న వారిలో కొంతమందికి పింఛన్ పునఃపరిశీలన పేరుతో నోటీసులు జారీ చేస్తున్నారు. టెక్కలి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, నందిగాంతో పాటు ఇదే డివిజన్ పరిధిలో కొన్ని మండలాలు అలాగే పలాస డివిజన్ పరిధిలో కొన్ని మండలాలకు చెందిన దివ్యాంగులకు వారి పింఛన్ల పునఃపరిశీలనకు టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పరిశీలన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రతీ సోమ, మంగళ, బుధవారాల్లో నిర్దేశించిన వారికి ఇక్కడ పునఃపరిశీలన చేస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల నుంచి దివ్యాంగులు అవస్థలు పడుతూ హాజరవుతున్నారు. జనవరి 27 నుంచి ఆప్తాల్మిక్, ఆర్థోపెడిక్‌కు సంబంధించి పింఛన్‌దారులను పునఃపరిశీలన చేస్తారు. ఇప్పటి వరకు కంటికి సంబంధించి సుమా రు 250 మందికి, ఆర్థోపెడిక్‌కు సుమారు 450 వరకు పునఃపరిశీలన చేశారు. అయితే అన్ని రకాల అర్హతలు ఉన్నప్పటికీ తమ పింఛన్లు తొలగించేస్తారేమోనని ఆందోళన చెందుతున్నారు. తమ గ్రామాల పరిధిలో శిబిరాలు ఏర్పాటు చేసి పునఃపరిశీలన చేయాలి తప్పా ఇలా అవస్థలకు గురి చేయడం సరికాదంటూ కొంత మంది ఆవేదన వ్యక్తం చేశారు.

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి

● వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్



సమావేశంలో మాట్లాడుతున్న తిలక్

టెక్కలి: కూటమి ప్రభుత్వం ఎనిమిది నెలల పాలనపై ప్రజలు అసంతృప్తిలో ఉన్నారని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. టెక్కలి పార్టీ కార్యాలయంలో నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, అనుబంధ కమిటీల నాయకులతో శుక్రవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో పార్టీలోని అన్ని విభాగాల అనుబంధ కమిటీల నియామక ప్రక్రియను పూర్తి చేయాలని కమిటీ ప్రతినిధులకు సూచించారు. అనంతరం మాట్లాడుతూ.. ఇటీవల వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన పర్యటనల్లో ప్రజల నుంచి వచ్చిన స్పందన చూసి కూటమి నాయకులకు చెమటలు పడుతున్నాయని అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందారనే విషయం ప్రజలకు అర్థమైందన్నారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో ప్రజలకు అండగా పోరాటం చేయాలని నాయకులను కోరారు. వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు ఉన్న పంచాయతీల్లో అభివృద్ధి పనుల విషయంలో, నిధులను ఖర్చు చేయడంలో పక్షపాత వైఖరిపై పంచాయతీరాజ్ కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. దీనికి సంబంధించి ఆయా సర్పంచ్‌లు పూర్తి స్థాయిలో వివరాలు సిద్ధం చేయాలన్నారు. గ్రామాల్లో కూటమి నాయకుల కక్ష సాధింపు చర్యలకు ఎటువంటి భయాందోళన చెందవద్దని.. ప్రతిఒక్కరికీ అండగా ఉంటానని భరోసానిచ్చారు. సమావేశంలో నాయకులు సత్తారు సత్యం, ఎస్.హేమ సుందర్‌రాజు, టి.కిరణ్, కెల్లి గోవింద్, ఎస్.సాబతో, ఎస్.భీమారావు, టి.ఫాల్గుణరావు, ఎ.రాహుల్, కె.గణపతిరావు, పి.శ్రీనివాస్‌రెడ్డి, రాములమ్మ, ఎస్.నరేష్, కె.జీవన్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న మెరైన్ పోలీసులు, విద్యార్థులు

సోంపేట: సముద్రతీరంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని బారువ మెరైన్ సీఐ రమేష్‌కుమార్ అన్నారు. బారువ మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో బారువ సముద్ర తీరంలో పరిసరాలు శుక్రవారం పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ.. సముద్ర తీరం పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతీ వ్యక్తిపై ఉందన్నారు. ఎస్సైలు శ్రీనివాసరావు.శిరీష, ట్రీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ సోమేశ్వరరావు, బారువ ప్రాథమిక పాఠశాల, డిగ్రీ కళాశాలవిద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తామని యువజన విభాగం అధ్యక్షుడు నర్తు ప్రేమ్‌కుమార్, రైతు విభాగం అధ్యక్షుడు నీలాపు చంద్రయ్య, వాణిజ్య విభాగం అధ్యక్షుడు తిప్పన నాగరాజురెడ్డి, ఆర్టీఐ విభాగం అధ్యక్షుడు బదకల మోహన్‌దాస్ అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తమకు అప్పగించిన బాధ్యతలకు పూర్తిగా న్యాయం చేసి చిత్తశుద్ధితో పనిచేస్తామని అన్నారు. ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు, జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాసు, మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, జెడ్పీ చైర్పర్సన్, నియోజకవర్గ సమన్వయకర్త పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

కవిటి: తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీల కన్వీనర్ ఎన్ని అశోక్ అన్నారు.

సందడిగా కళాశాల వార్షికోత్సవం



విద్యార్థినులకు బహుమతులందజేస్తున్న ప్రిన్సిపాల్ జగదీష్ కుమార్

కంచిలి: మండల కేంద్రం కంచిలిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం సందడిగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ వి.జగదీష్‌కుమార్ ఆధ్వర్యలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా గత ఏడాది పరీక్షల్లో మంచి ప్రతిభ కనబర్చిన విద్యార్థినులు సిరివెన్నెల, సరిత, మీనాక్షిలకు ప్రైజ్‌మనీ ఇవ్వడంతోపాటు పలువురు విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతుల్ని అందజేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతూలను అలరించాయి. కార్యక్రమాల్లో జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీతారామినాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మూడు ఎక్సైజ్ కేసులు నమోదు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పరిధిలో రెండురోజుల్లో నిర్వహించిన దాడుల్లో మూడు కేసులు నమోదయ్యాయని సీఐ పి.దుర్గాప్రసా ద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇచ్ఛాపురం మండలం ఈదుపురం గ్రామంలో గురువారం నిర్వహించిన దాడుల్లో ఒడిశాకి చెందిన పది మద్య సీసాలను, మొబైల్ పార్టీ ఎక్సైజ్ సిబ్బంది నిర్వహించిన దాడుల్లో ఒడిశాకి చెందిన 15 టిన్ బీర్లను, శుక్రవారం మొబైల్ పార్టీ సిబ్బంది చేపట్టిన దాడుల్లో ఒడిశాకి చెందిన పది టిన్ బీర్లతో పాటు రెండు ఆఫీషర్స్ చాయిస్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసులు నమోదుచేశామన్నారు. చేసుకొని కేసులు నమోదు చేసినట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.

● అమ్మ భాషకు వందనం

మాతృభాష లేనిదే మానవ మనుగడ లేదని వక్తలు అన్నారు. అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని పాఠశాలలు, కళాశాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు, ఒడియా, హిందీ అక్షరాకృతిలో విద్యార్థులు కూర్చొని అలరించారు. అమ్మ భాషను అందరూ ఆదరించాలని ఉపాధ్యాయులు పిల్లలకు సూచించారు.
–సాక్షి నెట్‌వర్క్



ఇచ్ఛాపురం రూరల్: తెలుగు అక్షరాలను, పదాలను ప్రదర్శిస్తున్న కొళిగాం పాఠశాల విద్యార్థులు



టెక్కలి డిగ్రీ కళాశాలలో తెలుగుతల్లి చిత్రపటానికి పూల మాలలు వేస్తున్న ప్రిన్సిపాల్ గోవిందమ్మ



ఇచ్ఛాపురం: మాట్లాడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రజనీకుమార్‌పాఢీ



కాశీబుగ్గ: మందస మండలం కుంటికోటలోని కె.నారాయణ పాఠశాలలో తప్పెటగుళ్ల ప్రదర్శన

ధాన్యం కొనుగోలు చేయాలని మంత్రికి వినతి

టెక్కలి: కోటబొమ్మాళి మండలంలో పండించిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో ప్రభుత్వం కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరారు. ఈ మేరకు వ్యవసాయ శాఖామంత్రి అచ్చెన్నాయుడుకు కోటబొమ్మాళిలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వినతిపత్రాన్ని అందజేశారు. అలాగే టమాట, ఇతర పంటలు సాగుచేసే రైతులు కూడా మంత్రిని కలిసి పంటను ప్రభుత్వం కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

కంచిలి: జె.బెల్లుపడ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు ఒబినింటి క్రిష్ణమూర్తి కిడ్నీ వ్యాధితో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి మృతుని కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించారు. మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, స్థానిక సర్పంచ్ అయిదం జయరాం, నేతలు లడ్డు కేశవపాత్రో, దుర్గాసి ధర్మారావు, మెండా ప్రకాశరావు, కొరికాన వెంకట్, ఇప్పిలి నీలయ్య ఉన్నారు.

ఆర్.బెలగాంలో పోలీసుల పల్లెనిద్ర

కవిటి: పల్లెల్లో ప్రశాంత వాతావరణం ఉండాలిన కాశీబుగ్గ సర్కిల్ డీఎస్పీ వి.వెంకటఅప్పారావు అన్నారు. ఆర్.బెలగాంలో శుక్రవారం రాత్రి పోలీసు శాఖ ఆధ్వర్యంలో పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొ న్నారు. ముందుగా గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఇచ్ఛాపురం సీఐ మీసాల చిన్నంనాయుడు, కవిటి ఎస్ఐ వీ రవివర్మ, గ్రామపెద్దలు మద్దిలి ఈశ్వరరావు, భాసుదేవరా పాల్గొన్నారు.

ప్రణాళికతోనే విజయం

వజ్రపుకొత్తూరు: ఇంటర్మీడియెట్ విద్యార్థులు ప్రణాళికతో చదివితే సత్ఫలితాలు సాధిస్తారని పూండి–గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రమేష్ పట్నాయక్ అన్నారు. కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం శుక్రవారం ఉత్సాహంగా నిర్వహిచారు. సెల్ ఫోన్, టీవీలకు దూరంగా ఉండి చక్కటి ప్రణాళికతో పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అన్నారు. అనంతరం పాఠాలు బోధించిన అధ్యాపకులకు విద్యార్థులు ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు జానపద, సినీ గీతాల ఆలాపన, నృత్యాలతో అలరించారు. పలు ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు హరిబాబు, సీతారాజు, చంద్రశేఖ ర్, తిరుపతిరావు, లక్ష్మణరావు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

చెత్త తొలగింపు..




ఇచ్ఛాపురం మండలం ఎం.తోటూరు–రత్తకన్న ఎల్‌సీ గేట్ వద్ద ఇప్పటి వరకు ప్రయాణికులు పడుతున్న అవస్థలు అండర్ పాసెజ్ రూపంలో తీరిపోనున్నాయి. చెత్తా, చెదారంతో పూర్తిగా నిండిపోయిన పాసెజ్‌ను ఎం.తోటూరు యువకులు పరిశుభ్రం చేసినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. దీంతో యువసూర్య చారిటిబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎం.రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు కాళ్ల గోపీలు రైల్వే అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో స్పందించారు. శుక్రవారం రైల్వే కూలీలు స్వచ్ఛభారత్ నిర్వహించి రాకపోకలకు అనువుగా మార్చడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.
–ఇచ్ఛాపురం రూరల్

ఇదేం అప్రోచ్..



టెక్కలి నుంచి తెంబూరు వెళ్లే మార్గంలో వలియాసాగరం సమీపంలో ఫ్లైఓవర్‌కు అనుకుని ఉన్న అండర్ పాసేజ్ అప్రోచ్ రోడ్డు పూర్తిగా రాళ్లు తేలి ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డుపై రోజూ భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో పూర్తిగా మరమ్మతులకు గురైంది. దీంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అప్రోచ్ రోడ్డుకు మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.
–టెక్కలి

ఇది ప్రమాదకరం కాదా..



గ్రానైట్ లారీ డ్రైవర్లు హైవేలకు పక్కన ఉండే సర్వీస్ రోడ్లను ఇష్టానుసారంగా ఆక్రమించేస్తున్నారు. దీంతో ఇతర వాహనదారులకు అవకాశం లేకుండా ఇబ్బందికరంగా మారుతుంది. పలాస నుంచి టెక్కలి మధ్యలో హైవేకు పక్కన నిత్యం ఈ పరిస్థితి నెలకుంటుంది. వీటిని గమనించకుండా వెళ్తూ చాలామంది ప్రమాదాలబారిన పడుతున్నారు.
–కాశీబుగ్గ